మనందరకు దూరపుకొండలు అంటే నునుపు, ఎక్కడో దేవుడు ఉన్నాడు అంటే నమ్ముతాము కాని మన హృదయంలో దేవుడు ఉన్నాడు అంటే మనకు నమ్మకం కుదరటం లేదు.

బుద్ధుడు ఏమని చెపుతున్నాడు అంటే మీరు ఏ విషయంలోను అతిగా వెళ్లవద్దు, మీ పనులు మీరు చేసుకోండి, ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకొంటూ ధర్మమార్గాన్ని విడిచిపెట్టకుండా, అందరూ అలా ఉన్నారు మనం కూడా అలా ఎందుకు ఉండకూడదు అని ఇతరులను కాపీ కొట్టకుండా నీ మార్గంలో నువ్వు ప్రయాణం చెయ్యి, నువ్వు ఒంటరిగానే వెళ్ళు, కూడా జనం ఎందుకు అంటున్నాడు. యు వాక్ ఎలోన్. నిర్వాణసుఖాన్ని పొందటానికి నువ్వు ఒక్కడివే నడిచి వెళ్ళు, నీ కూడా జనం ఎందుకు? నీ కూడా వచ్చిన వారు వస్తారు, రాని వారిని వదిలెయ్యి. నువ్వు చనిపోయి నప్పుడు నీ కూడా పదిమంది వస్తున్నారా? నువ్వు వందకోట్లు సంపాదించి ఎవడికైతే ఇచ్చావో వాడు కూడా మరణానంతరం నీ కూడా రాడు, కనీసం వల్లకాటికి కూడా రాడు, అది ప్రపంచం యొక్క స్థితి, అది సమాజం యొక్క స్థితి. నీ పద్ధతిలో నువ్వు వెళ్లిపో, నీకు కావలసి ఉంటే సత్పురుషుల సహకారం తీసుకో, నీకు సహకారం లేదు అనుకో నీ మార్గంలో నీవు ఒంటరిగా నడిచి వెళ్లిపో, నిర్మలంగా నిశ్చలంగా వెళ్ళు, నీ మార్గం నువ్వు విడిచిపెట్టవద్దు. మన విగ్రహాలు రోడ్డు ప్రక్కన పెడతారు అనుకోండి, మన పేర్లు పుస్తకాలలో వేస్తారు అనుకోండి. మనకు శాంతి లేనప్పుడు, మనకు సుఖం లేనప్పుడు ఆ పుస్తకాలలో పేర్లు, విగ్రహాలు ఇవన్నీ ఏమి చేసుకొంటాము. మీ బుద్ధి నిర్మలంగా నిశ్చలంగా ఉంటేనే అది శుచి, లోపలశుచిగా ఉన్నామో లేదో మనం చూసుకోవాలి. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఈ శరీరం బయటకు వెళ్లిపోతుంది. ఎందుచేతనంటే అది మనం కాదు. భగవంతుడి నామాన్ని ఎలా జ్ఞాపకం పెట్టుకొంటున్నారో, సాధనకు ఇది కూడా అలా జ్ఞాపకం పెట్టుకోండి. సాధన ఎందుకు అంటే ఇప్పుడు మనం ప్రకృతి ఒడిలో ఉన్నాము. ప్రకృతి ఒడిలోనుండి జంప్ చేసి శివుడి ఒడిలోనికి వెళ్లటానికి మనం చేసే ప్రయత్నమే సాధన.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-08-05, వడ్లూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఉన్న వస్తువు ఒక్కటి అంటే ఒక్కటే. దానిని అనేకమంది అనేక పేర్లతో పిలిచారు, ఎన్ని పేర్లు పెట్టి పిలిచినా వస్తువు ఒక్కటే. సాధన అనేది మీరు ఎలా చేయాలి అంటే మీరు

కష్టపడి ఏదో పనిచేస్తారు, దానికి ఫలితం వస్తుంది అనుకోండి, అప్పుడు మీకు చాలా ఆనందం వస్తుంది. ఫలితం వచ్చినప్పుడు మీకు ఆనందం ఎలా ఉందో, సాధన చేసేటప్పుడు కూడా అంత ఆనందంగా, అంత ఇష్టంగా, అంత తియ్యగా జరుగుతూ ఉంటే పని తేలిక అవుతుంది. సాధన చేసేటప్పుడు మీకు కష్టం ఉండదు, అది అనుభవానికి వచ్చినప్పుడు ఎంత తియ్యగా ఉంటుందో సాధన కూడా అంత తియ్యగా ఉంటుంది. ఇవన్నీ మీరు బాగా నేర్చుకుంటే మీరు తరిస్తారు. మనకు చేతకాకపోతే నేర్చుకోవాలి కాని నేర్చుకోవటానికి సిగ్గుపడకూడదు. సిగ్గు ఉన్నవాడికి, శ్రద్ధ లేనివాడికి చదువురాదు. కర్మ చేస్తూ కర్మలోనుండి విడుదల పొందాలి. అంటే కర్మ చేసేటప్పడే ఆ కర్మలో నుండి ఎలా విడుదల పొందుతామో ఆ పద్ధతిలోనే కర్మ చేయాలి. ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే ఆ పని మనలను బంధించదు, అది మనకు మోక్షాన్ని ఇస్తుంది. అంటే నువ్వు మాట్లాడేమాట, నువ్వు చేసే పని, నువ్వు చేసే సాధన అంతా కూడా నీవు మోక్షం పొందటానికి సహకరించాలి. మీ ఇంట్లో ఉన్న వ్యక్తులకు కూడా వాడు భగవంతుడు ప్రతినిధి అనుకొని సేవ చేయాలి కాని మోహం పెట్టుకొని చేయకూడదు. మనం కర్తలేని కర్మ చేస్తూఉంటే, అహంభావన లేకుండా పనిచేస్తూ ఉంటే ఆ పని వలన మనం పవిత్రులమవుతాము. మనం చేసేపని మనలను బంధించకూడదు, మనం చేసే పని మనలను బంధంలోనుండి విడుదలచేసి, మనం మోక్షం పొందటానికి సహకరించాలి. ఇవన్నీ తెలుసుకొని చేస్తే మనం భౌతికంగా బాగుపడతాము, ఆధ్యాత్మికంగా మనకు పురోగతి ఉంటుంది. భగవంతుడు మనకు అన్ని అవకాశాలు ఇచ్చాడు అనుకోండి, వాటినిచూసి గర్వం తెచ్చుకోకూడదు. ఎగిరిఎగిరి పడేవాడికి ఏమీ రాదు, చివరకు బూడిద మిగులుతుంది. అణిగిఉన్నవాడికి ఐశ్వర్యం కలుగుతుంది, ఒకోసారి పూర్వజన్మ సుకృతాన్ని బట్టి మీకు అనేక అవకాశములు వస్తాయి, వాటినిచూసి పొంగిపోకూడదు, అవిఅన్నీ నిజం కాదు. ఒకవేళ మీ రోజులు బాగావెళ్ళిపోతూ ఉంటే అది మంచిస్వప్నం, రోజులు బాగావెళ్ళకపోతే అది చెడ్డస్వప్నం, అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే, రెండూ నిజం కాదు. కాని నిజం అనేది ఒకటి ఉంది, అది మన హృదయంలోనే ఉంది. ఏదైతే మనం నేను నేను అంటున్నామో అది నిజమైననేను కాదు. అందుచేత రమణమహర్షిగారు ఏమని చెప్పారు అంటే ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో ఆ నేను నువ్వు కాదని ముందు అలవాటు చేసుకో. ఆ నేనుతో నీవు కలిసిపోవద్దు. నీకు ఏదైనా మంచిజరిగితే నువ్వు పొంగిపోకు, మంచిజరగకపోతే

కుంగిపోవద్దు, మంచి అయినా, చెడ్డ అయినా అహంకారానికే. అహంకారానికి మేత తగ్గించు. అహంకారానికి మేత తగ్గిస్తూ వెళితే అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది, అప్పుడు నీ హృదయంలో ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది. కర్మఫలం మీద కాంక్ష లేకుండా పనిచేస్తూ ఉంటే పని పూర్తి అవుతుంది, లోపల పవిత్రులమవుతాము. అహంకారం లేకుండా, గర్వం లేకుండా మనం పనిచేస్తే ఆ పని మనకు సుఖాన్ని తీసుకొని వస్తుంది. కౌరవులకీ, పాండవులకీ రాజీ కుదరలేదు, యుద్ధం ఖాయం అయిపోయింది. మా పక్షానికి రండి, మా పక్షానికి రండి అని ధుర్యోధనుడు, అర్జునుడు అందరి రాజులను అడుగుతున్నారు. ఇద్దరూ కృష్ణుడి దగ్గరకు వెళ్ళారు. కృష్ణుడు మాయావి, వారు ఇద్దరూ వస్తారని ఆయనకు తెలుసు. ఆయన దొంగ నిద్రపోతున్నాడు, ఆయన పాదాల దగ్గర ఒక కుర్చీ, తల దగ్గర ఒక కుర్చీ వేసాడు. ధుర్యోధనుడు ముందుగా వచ్చాడు. నేను రారాజును పాదాల దగ్గర కూర్చోవటం ఏమిటి అని గర్వం వచ్చింది, తల దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నాడు, వాడు అక్కడ పరమాత్మను గుర్తించలేకపోతున్నాడు, భౌతికాన్నే గుర్తిస్తున్నాడు. తరువాత అర్జునుడు వచ్చాడు ఆయన పాదాల దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. దొంగ నిద్రపోయేవాడు మేల్కొన్నాడు. ముందుగా పాదాల దగ్గర ఉన్నవాడు కనిపిస్తాడు కదా, ఆయనకు అర్జునుడు కనిపించాడు. అర్జునా! ఏమిటి ఇలా వచ్చావు? అని అడిగాడు. భారతయుద్ధం జరుగుతోంది కదా నీ సహాయం కోసం వచ్చాను అన్నాడు. ఒకవేళ వాడి తరుపుకు వెళ్ళిపోతాడేమో అని ధుర్యోధనుడు కంగారుపడిపోయి వాడు ముందు రాలేదు, ఇక్కడకు నేను ముందు వచ్చాను అని చెప్పాడు. మీరు ఇద్దరూ వచ్చారు, ఇద్దరూ మాకు కావలసిన వారే. నేను ఏమీ యుద్ధం చేయను, నేను ఒక్కడినే ఒక పక్షాన ఉంటాను, నా సైన్యం అంతా ఒక పక్షాన ఉంటుంది అని చెప్పాడు. నీ సైన్యం అంతా నాకు ఇచ్చేయి అని ధుర్యోధనుడు చెప్పాడు. నువ్వు యుద్ధం చేయకపోయినా నీవు మా వెంట ఉంటే సరిపోతుంది అన్నాడు అర్జునుడు. ఇక్కడ మీరు గ్రహించండి. ధుర్యోధనుడికి భౌతికం కావాలి, క్వాంటిటీ కావాలి, ఒకటి లేని సున్నలు కావాలి. ఒకటిలేని సున్నలు వంద సున్నలు కూడినా సున్న వస్తుంది కాని ఒకటి రాదు. అర్జునుడికి చైతన్యం కావాలి. నేను యుద్ధం చేయను నీ రథంతోలతాను అని చెప్పాడు, అర్జునుడి రథం తోలాడు కాబట్టి ఆయనను పార్థసారథి అన్నారు. ఓ కృష్ణా! నీవు అర్జునుడికే సారథిగా ఉండటం కాదు, ఈ జీవకోటి అందరికీ సారథిగా ఉండాలి అని వివేకానందుడు అన్నాడు. నీవు

అర్జునుడి ప్రక్కన కూర్చొని మురళి ఊదుతావేమో అనుకొన్నాను కాని నీవు రథం తోలుతాను అంటున్నావు, బండి తోలటం ఎప్పుడు నేర్చుకొన్నావు కృష్ణా అంటున్నాడు ధుర్యోధనుడు. ఆ గర్వం పనికిరాదు అని చెప్పటం కోసం ఈ మాటలు చెపుతున్నాను. మనలో కూడా అంత అహంకారం ఉన్నవారు, అంత గర్వం ఉన్నవారు ఉంటారు, అది మనం చూసుకోవాలి. అలా అహంకారం పెంచుకొంటే, గర్వం పెంచుకొంటే ధుర్యోధనుడికి పట్టిన గతే మనకు కూడా పడుతుంది. మనకు ఐశ్వర్యం ఉన్నా, అధికారం ఉన్నా గర్వం రాకుండా చూసుకోవాలి. ఈ లోకంలో ఉన్న ఎంజాయ్‌మెంట్సును అతిక్రమించటం చాలా కష్టం కాని ప్రయత్నం చేస్తే సఫలం అవుతాము. మీకు భౌతికంగా ఏవైనా అవకాశములు వచ్చినా వాటిని చూసి గర్వం తెచ్చుకోవద్దు, ఆ అవకాశములను ఉపయోగించుకొని మోక్షం పొందటానికి ప్రయత్నం చేయండి. మీకు ఎన్ని అవకాశములు ఉన్నా, ఎన్ని భోగాలు ఉన్నా ఆత్మజ్ఞానం లేకపోతే దుఃఖంలోనుండి, అశాంతిలోనుండి ఆ జీవుడు విడుదల పొందలేడు అని ఉపనిషత్‌లలో ఉంది. సుఖం అంటే ఏమిటి? ఒక వస్తువుతో గాని, ఒక వ్యక్తితోగాని, ఒక పదార్థంతోగాని, లోకంతోగాని, చావు పుట్టుకలతోగాని సంబంధం లేకుండా తను స్వతంత్రంగా ఉన్నప్పడు ఏ సుఖాన్ని అయితే అనుభవిస్తున్నాడో అది నిజమైన సుఖం. బాహ్యమైన వస్తువులనుండిగాని, బాహ్యమైన సంఘటనల నుండిగాని, బాహ్యమైన వ్యక్తులనుండిగాని మనం ఏదైనా సంతోషం తీసుకొంటాము అనుకోండి, అది తాత్కాలికంగా బాగా ఉన్నా ఆ సంతోషం భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతుంది. అంటే వస్తువుల మీదగాని, వ్యక్తులమీదగాని, లోకంమీదగాని మన హేపీనెస్ ఆధారపడి ఉండకూడదు, అలా ఉంటే అది ఏదోరోజు భంగం అవుతుంది. ప్రతీమనిషి ఈ శరీరం నాది, ఈ పేరు నాది అనుకొంటూ ఆ శరీరంతోటి, పేరుతోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటాడు, అవే వాడిని బంధిస్తాయి. ఈ రెండింటిని మనం అతిక్రమించ లేకపోతున్నాము. ఇలా మనకు రూపబుద్ధి ఉన్నంతకాలం, నామబుద్ధి ఉన్నంతకాలం మనం శవాలను మోస్తూ ఉండవలసిందే. ఉపనిషత్‌లలో ఏమని చెప్పారు అంటే నది వెళ్ళి సముద్రంలో ఎలా ఐక్యమవుతుందో అలాగ నీవు రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి విడుదల పొందినప్పడు నువ్వు నీ హృదయంలో ఉన్న నిజమైన ఆత్మలో, నారాయణుడిలో ఐక్యమవుతావు. మనం శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి కాని యల్లయ్యమాటలు, పుల్లయ్యమాటలు భుజాన వేసుకొని తిరగకూడదు. భగవంతుడు చెప్పిన మాటను మనం

గౌరవిస్తూ ఉంటే, దాని మీద ఇష్టం పెంచుకొంటూ ఉంటే, ఆయన చెప్పినట్లుగా మనం జీవిస్తూ ఉంటే ఆయన స్వరూపం మనకు ఎరుకలోనికి వస్తుంది. భగవంతుడి నామాన్ని మనం స్మరిస్తూ ఉంటే మనకు అక్కరలేని తలంపులు ఆగిపోతాయి. నీకు అక్కరలేని తలంపులు, చెడు తలంపులు వస్తున్నాయి అనుకో అవి నీ మనస్సును అపవిత్రం చేస్తాయి. ఒక్క ఎండ్రిన్ చుక్క లోపలకు వెళ్ళింది అనుకో, అది నిన్ను చంపకపోయినా లోపల మొత్తం డైజెస్టివ్ సిస్టమ్‌ను పాడుచేస్తుంది. అలాగే మనకు ఏదైనా ఒక చెడు తలంపు వచ్చింది అనుకో అది మన మనస్సును ఎంతోకొంత పాడుచేస్తుంది. ప్రతీవాడు ఏదో రకంగా సంపాదించుకోవాలి అనుకొంటున్నాడు కాని ఆ సంపాదనలో ధర్మం ఉందా అని ఎవడు చూసుకోవటంలేదు. అంటే ఎయిర్ పొల్యూషన్ ఎలా ఉందో, వాటర్ పొల్యూషన్ ఎలా ఉందో కలియుగంలో మానవుడి సంపాదనలో కూడా అంత పొల్యూషన్ ఉంటుంది అని వ్యాసుడు చెప్పాడు అంటే ఎంతదూరం ఆలోచించి చెప్పాడో చూడండి. మన దగ్గర డబ్బు ఉంది, డబ్బు ఉంది అని అనుకొంటున్నాము. ఆ డబ్బు మనకు ఎలా వచ్చింది, ఎంతో మందికి అపకారం చేస్తే ఆ డబ్బు వచ్చిందా లేక న్యాయంగానే సంపాదించుకొన్నామా అనేది చూసుకోండి. నీ దగ్గర ఉన్న వెల్త్‌లో పొల్యూషన్ ఉందో లేదో చూసుకో. ఇప్పుడు నీవు అనుభవించేది కూడా భగవంతుడి ప్రసాదం అని అనుభవించాలి అంతేగాని నీ సొంతం అని అనుకోవద్దు. అది నీకోటాకు ఆయన కేటాయించాడు అంతేగాని అది నీది కాదు, అంతా ఆయనదే. మీకు, నాకు, పంచభూతాలకు, మొత్తం సృష్టికంతకూ ఆయనే యజమాని. మీరందరు మమ్మల్ని గౌరవిస్తారు అనుకోండి, మాలో విశేషం ఏమీ లేదు. భగవంతుడిని మేము స్మరించుకొంటూ ఉంటే ఆ భగవంతుడి రూపాన్ని మీరు ఎలా గౌరవిస్తారో మమ్మల్ని కూడా అలా గౌరవిస్తారు. భగవంతుడిని స్మరించగా స్మరించగా ఆయన సారూప్యం పొందుతాము, ఆయన సమీపంలోనికి వెళ్ళిపోతాము. భగవంతుడు తన శరీరం కంటే భక్తుల శరీరాలను బాగా చూసుకొంటాడు. మనకు ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి సంతోషం వస్తుంది. సమానబుద్ధిని మనం జాగ్రత్తగా కాపాడుకొంటున్నాము అనుకోండి. భగవంతుడు ఆయన దయను చూపించి, ఆయన ఔన్నత్యాన్ని మనకు తెలియపరచి అక్కడ మన మనస్సు నిలబడేటట్లు చేసి, ఆయనను ప్రేమించేటట్లు ఆయనే చేసుకొని ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం. చాలా తేలికయిన మార్గాన్ని విడిచిపెట్టేసి మీరు

కష్టమయిన మార్గాలు పట్టుకొంటున్నారేమో అంటున్నాడు పరమాత్మ. నా నామాన్ని స్మరించుకోవటం వలన, నా రూపాన్ని ధ్యానించటం వలన, నేను చెప్పిన మాటలు తలపెట్టుకోవటం వలన, నాయందు ప్రేమకలిగి ఉండటం వలన మీరు తరిస్తారు. నాయందు ప్రేమ కలిగి ఉంటే మీకు ఏకాగ్రత కలుగజేసే బాధ్యత, మీకు పుణ్యం సంపాదించిపెట్టే బాధ్యత నాది అంటున్నాడు. మనం కర్తృత్వం లేకుండా కర్మచేస్తే వాడిని పుణ్యం అంటుకోదు, పాపం అంటుకోదు, అదే వాడికి కడసారిజన్మ అంటే వాడు పరమాత్మలో ఐక్యమవుతాడు. మనం చేస్తే ఇష్టంతో చేస్తాము, లేకపోతే అయిష్టంతో చేస్తాము అందుచేత మనలను కర్మ వాసనలు చుట్టుకొంటాయి, ఈ కర్మ వాసనలే మనకు రాబోయే జన్మలకు బీజాలు అవుతాయి. మనకు అందరకు కూడా ఇంట్లో వారు అంటే ఇష్టం ఉండదు, సమాజం అంటే ఇష్టం ఉండదు, దేవుడు అంటే ఇష్టం ఉండదు, అందరికీ ఎవరి శవం అంటే వారికి బాగా ఇష్టం, ఎవరి అహంకారం అంటే వారికి బాగా ఇష్టం. నేను చెప్పిన మాటలు అసత్యాలు అనుకొంటే మీరు ఇంటికి వెళ్ళి చూసుకోండి. మనకు అందరికంటే కూడా మన శరీరం అంటే, మన మనస్సు అంటే మనకు చాలా ఇష్టం. మనం ఎక్కడికి వెళ్ళినా ఈ రెండూ సిద్ధమవుతాయి. శరీరం చనిపోయిన తరువాత ఇంక అది మన కూడా రాదు కాని మనస్సు మాత్రం శరీరం చనిపోయిన తరువాత కూడా మన వెంట వచ్చేస్తుంది. ఈ రెండింటికోసమే మనం చెడ్డ పనులు చేస్తాము, శాస్త్రాన్ని వదిలేస్తాము. మనస్సులో ఉన్న కోరికలను సంతృప్తి పరచుకోవటానికి, శరీరాన్ని సుఖపెట్టటానికి వీటికోసమే మనం జీవిస్తూ ఉంటాము, పరమాత్మ చెప్పిన మాటలను మనం పట్టించుకోము. అందుచేత ఇవి రెండూ మనలను బంధిస్తున్నాయి. ఈ రెండింటిని ఒక ప్రక్కనపెట్టి శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించేవాడికి మోక్షం వస్తుంది. ఆత్మవిద్యను ఎందుకు నేర్చుకోమన్నాడు అంటే ఆత్మవిద్యను నీవు శ్రవణం చేయగా, శ్రవణం చేయగా దాని మీద నీకు రుచి కలుగు తుంది, అప్పుడు దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తావు, అర్థం చేసుకొన్నాక ఆచరిస్తావు. ఆచరించగా ఆచరించగా లోపల ఉన్న వస్తువును ఎప్పుడు అనుభవంలోనికి తీసుకొని రావాలో పరమాత్మ ముహూర్తం పెట్టుకొని అనుభవైకవేద్యం చేస్తాడు, మనం అనుభవాల కోసం ఎదురుచూడనక్కరలేదు. మన శరీరం వెయ్యి సంవత్సరాలు ఇక్కడ ఉండదు, అది ఉన్నంతకాలం భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవిస్తూ ఉంటే తరువాత అంతా ఆయనే చూసుకొంటాడు. భగవంతుడి

మీద మనకు నిజంగా ప్రేమ కుదిరితే మనకు మోక్షం వచ్చేస్తుంది. అయితే ఈశ్వరుడి పట్ల ప్రేమకలగటానికి మనకు పూర్వజన్మ పుణ్యబలం ఉండాలి. పూర్వజన్మలలో మనం ఎంతో కొంత సత్కర్మ చేయకపోతే ఇప్పడు మనం ప్రయత్నం చేసినా మన మొఖం ఈశ్వరుని వైపుకు తిరగదు. మీరు నామాన్ని స్మరించుకోమంటున్నారు కాని నామాన్ని స్మరించుకోవాలనే బుద్ధి నాకు రావటంలేదు అని ఒకరు అడుగుతున్నారు. ఆ బుద్ధి ఎందుకు రావటంలేదు అని అడిగాను. పూర్వజన్మలో పాపాలు చేసి ఉంటాను అందుచేత భగవంతుడి నామాన్ని స్మరించుకోవాలనే బుద్ధి కలగటం లేదు అన్నారు. పూర్వజన్మలో పాపాలు చేసాను అంటున్నావు కదా, అది మర్చిపో. అది మర్చిపోవటానికి ప్రయత్నం చెయ్యి నీకు నామం చేసుకొనేబుద్ధి కలుగుతుంది అని చెప్పాను, మర్చిపోవటమే మందు. మీకు ఎప్పడైనా సంతోషం వస్తూ ఉంటుంది. సంతోషం వేరు, సుఖం వేరు. ఇది బాగా అర్థం చేసుకోండి. ఉన్నవస్తువుతో మీరు తాదాత్మ్యం పొందినప్పడు వచ్చేది సుఖం, బయట వ్యక్తులద్వారా వస్తువుల ద్వారా వచ్చే దానిని సుఖం అనరు, అది సంతోషం, అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది. బయట వ్యక్తులతోగాని, లోకంతోగాని సంబంధం లేకుండా వచ్చే సుఖమే నిజమైనసుఖం, అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు దేహం చనిపోయిన తరువాత కూడా ఆ సుఖం అలా కంటిన్యూ అయిపోతుంది. పాండవులకు విజయం చేకూర్చాలి అని కృష్ణుడు అనుకొన్నాడు, ఒకసారి ఆయన అనుకొన్నాక అది ఎలా చేకూర్చాలో అంతా ఆయనే చూసుకొంటాడు, ఇంక మనకు సంబంధం లేదు. అలాగే మనకు మోక్షం ఇవ్వాలి అని భగవంతుడు అనుకొన్నాడు అనుకోండి అది ఎప్పడు ఇవ్వాలి, దానికి అనుగుణంగా మన బుద్ధిని ఎలా తిప్పాలి అది అంతా ఆయనే చూసుకొంటాడు, అసలు ఆయన అనుకోవాలి అంతే. శాస్త్రంలో ఏమని ఉంది అంటే నాకు మోక్షం కావాలి, నాకు మోక్షం కావాలి అనుకొనే వాడికి మోక్షం రాదు, ఏ జీవుడిని ఆయన ఎన్నుకొన్నాడో వాడికే ఆయన ఎరుకలోనికి వస్తాడు. కొంతమంది అన్నీ మాకే తెలుసు అనుకొంటారు, అన్నీ వారికే తెలిసినప్పడు వారి గొడవ మనకెందుకు అనుకొంటాడు. కవచకుండలాలు ఉండగా అర్జునుడు కూడా కర్ణుడిని జయించ లేడు. కర్ణుడికి ఎవరు ఏది అడిగితే అది ఇచ్చే అలవాటు ఉంది కాబట్టి ఇంద్రుడిని పంపించి కవచకుండలాలు అడిగించి కృష్ణుడు గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేస్తాడు. వాడే మాయావి. ఈ పనులు అన్నీ ఎందుకు చేస్తున్నాడు అని మీరు అనుకోవచ్చు. పాండవులకు

జయం కలగాలి అనుకొన్నాడు కాబట్టి అంతా ప్రిపేర్ చేస్తున్నాడు. అలాగే మనకు మోక్షం ఇవ్వాలి అని భగవంతుడు అనుకొన్నప్పడు ఆయనే లైన్ క్లియర్ చేసుకొంటూ వెళతాడు, వాడే పరమాత్మ. అయితే ఈశ్వరుడు ఉన్నాడా, లేడా అనే సందేహం పెట్టుకోవద్దు. ఈశ్వరుడిని మనం పూజించేటప్పడు, ఆయనను జపించేటప్పడు ఆయన అంతర్యామి, అన్ని శక్తులు ఉన్నవాడు, ఆయన సర్వజ్ఞుడు, మనలను అనుగ్రహించేవాడు ఆయనే అని ఆయన ఔన్నత్యాన్ని గుర్తించి మనం ఆయనను పూజించాలి. ఆయన ఔన్నత్యం తెలియకుండా ఆయన మనకు ఎలా ఎరుకలోనికి వస్తాడు. మనం మంచికర్మలు చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా ఇవి అన్నీ మన బుద్ధి శుద్ధి అవ్వటంకోసమే. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నా ఆయన మనకు గోచరమయితే కాని మనం పునర్జన్మలోనుండి విడుదల పొందలేము. మన బుద్ధి శుద్ధిఅయితేకాని ఆయన మనకు గోచరం కాడు. దానికి మనం లోపల వివేకం పెంచుకోవాలి, మంచితనం పెంచుకోవాలి, లోపల అంతస్థు పెంచుకోవాలి. ఎవరైనా చెడు మాటలు చెపుతున్నారు అనుకోండి, ఆ మాటలు ఎందుకు చెపుతున్నారో మనం అర్థం చేసుకోవాలి కాని అవి భుజానవేసుకొని తిరగకూడదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీవు ఏదైనా మాట్లాడితే ఆ మాట నీకు ఉపయోగపడాలి, అది వినేవాడికి ఉపయోగపడాలి. అంతేగాని ఒక ఉద్దేశం లేకుండా, కావాలి అని ఉపయోగంలేని మాటలు నువ్వు ఎందుకు మాట్లాడుతున్నావు, అలా ఎందుకు నీ ప్రాణశక్తిని పాడుచేసుకొంటావు అంటున్నారు. రావణుడి దగ్గర చాలా ఐశ్వర్యం ఉంది. ఇంత ఐశ్వర్యం పెట్టుకొని ఈ పాడుబుద్ధిఏమిటి వీడికి, వాడు ఒక్కడే పాడైపోయిన ఫరవాలేదు ఈ లంకలో ఉన్న జనాన్ని అంతా పాడుచేస్తున్నాడు అని ఆంజనేయస్వామి బాధపడ్డాడు, అంత ఐశ్వర్యం ఉంది. రావణాసురుడి యొక్క సంహారం అయిపోయిన తరువాత ఈ లంకారాజ్యం ఎవరో ఒకరికి ఇవ్వాలి కదా అందుచేత ఆ రాజ్యాన్ని విభీషణుడికి ఇచ్చేద్దాము, లంకా రాజ్యము వాళ్ళదే కదా వారికే ఇచ్చేద్దాము అని రాముడు చెపుతాడు. ఈ రాజ్యం మాకు అక్కరలేదు ఈ రాజ్యం నీకే ఇచ్చేస్తాము అని విభీషణుడితో చెపుతూ రాముడు ఒక మాట చెపుతాడు. శివుడేమో రావణాసురుడికి ఇచ్చాడు ఈ ఐశ్వర్యం, రావణాసురుడిది నీకు ఇస్తున్నాను, నాదంటూ ఏమీ నీకు ఇవ్వటం లేదు అని విభీషణుడితో రాముడు అంటాడు. ఈ వాక్యానికి నాకు ఆశ్చర్యం కలిగింది. రాముడి యొక్క గొప్పతనం, ఆయనలోని మంచితనం ఎంజాయ్‌చేస్తారని చెపుతున్నాను. అందుచేత రాముడిని మర్యాద

పురుషోత్తముడు అన్నారు. ఇప్పుడు మనం ఏమి చేస్తున్నాము అంటే ఎవరో చేసిన మంచి పనులు కూడా మేమే చేసాము అని చెప్పకొంటాము, ఇదీ కలియుగం. భగవంతుడి యొక్క గొప్పతనం శ్రవణం చేయకుండా, భగవంతుడి యొక్క ఔన్నత్యం మనకు తెలియకుండా ఆయన మీద మనకు ప్రేమ కలుగదు, ఇష్టం కలుగదు. ఆయన మీద ఇష్టం కలగటానికి ఆయన గురించి మనం శ్రవణం చేయాలి, ఆయన చెప్పిన మాటలు మననం చేయాలి. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానంలో నుండి బయటకు రావాలి. మనం ఎవరో ఒకరిని తిడుతూ ఉంటాము అనుకోండి, మన తిట్లు వాడు సహనంగా భరిస్తున్నాడు అనుకోండి. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే వారికి ఎంత సహనం ఉంది అనుకొని మనం పూర్వజన్మలో సంపాదించిన పుణ్యం ఏదైనా ఉంటే వారికి ఇచ్చేస్తాడు. అన్నవాడు పిశాచంగా ఉంటాడు, పడ్డవాడు దేవుడు అయిపోతాడు. అంటే భగవంతుడు వాడి సహనానికి మెచ్చుకొని ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఇంకొకమాట మీకు చెపుతున్నాను. ఇప్పడు ఇది మీకు అర్థమవ్వటం కష్టం, కాని వినటం మటుకు వినండి, ఇంకో పది సంవత్సరాల తరువాత మీకు అర్థమయినా ఫరవాలేదు. మీరు భక్తిని పెంచుకోవటం మానివేసి, సాధన చేసుకోవటం మానివేసి వాడు అటువంటివాడు, వీడు ఇటువంటివాడు అని ఎంతసేపు ఎవరో ఒకరిని తిడుతూ ఉంటారు అనుకోండి దీనికి భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే మీ బలహీనతలే బయటకు వస్తున్నాయి అని మీకు తెలియటం లేదు అన్నాడు. వారిలో ఆ బలహీనత ఉంది, వీరిలో ఈ బలహీనత ఉంది అని అంటూ వాడిని తిట్టి పడేసాము అని మనం అనుకొంటాము కాని నువ్వు తిట్లు పడే రోజులు దగ్గరకు వస్తున్నాయి అని నీకు తెలియటం లేదు అంటున్నాడు భగవంతుడు. మీరు ఇష్టమయిన వస్తువును తినేటప్పడు ఎంత ఆనందాన్ని అనుభవిస్తారో మీరు సాధన చేసేటప్పడు కూడా అంత ఆనందంగా ఉండాలి. అప్పడు భగవంతుని దయకు పాత్రులవుతారు. మీరు జపం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా సుఖంగా చేస్తున్నారా? చెయ్యటం లేదు, ఏదో లాంఛనం కోసం చేస్తున్నారు. కొంతమంది ఇంటి దగ్గర ధ్యానం చేసుకొంటారు, చిన్న చప్పడు అయింది అనుకోండి ఇంక వారిని పట్టుకొని తిట్టేస్తారు నీ మనస్సు పరమాత్మ మీద ఉంటే ఆ చప్పడు నీకు ఎందుకు వినబడుతుంది. అసలు యదార్థం చెప్పాలంటే ధ్యానం అనేది చేసేది కాదు, అది వచ్చేది. మనం అన్నం తింటాము, అన్నం తిన్నాక అది లోపల అరుగుతూ ఉంటుంది, అది మనకు తెలియదు. అలాగే నీవు చేసుకొనే జపం

కూడా నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా నీవు నుంచున్నా, కూర్చొన్నా, నడుస్తున్నా, ఏమి చేస్తున్నా లోపల సహజంగా జరిగిపోతూ ఉండాలి. అలా నామజపం సహజంగా జరుగుతూ ఉంటే అది అక్కరలేని తలంపులను దూరంగా నెట్టేసి, భగవంతుడి స్వరూపాన్ని మీకు పట్టి ఇస్తుంది. భగవంతుడి యొక్క నామాన్ని స్మరించగా స్మరించగా మనకు జ్ఞానం రావటానికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో ఆ ఆటంకాలను నామం తీసేస్తుంది, అందుచేత నామాన్ని శ్రద్ధగా, ప్రీతితో చేసుకోవాలి. ఆ నామమే మనలను చీకటిలోనుండి వెలుతురులోనికి, మృత్యువులో నుండి అమృతత్వంలోనికి తీసుకొని వస్తుంది. ఈ జీవుడు మనవాడు, వీడికి మన దయ చూపించాలి అని ఈశ్వరుడు ఒక్కసారి సంకల్పించాడు అనుకోండి, వాడికి మోక్షం వచ్చేసినట్లే. మనం ఆయనను ఎన్నుకోవటంకాదు, ఆయన మనలను ఎన్నుకోవాలి, ఆ యోగ్యత, అర్హత మనం సంపాదించుకోవాలి. భగవంతుడి పాదాలయందు భక్తిని విడిచిపెట్టవద్దు, ప్రాణం పోయేటప్పుడు కూడా నారాయణ స్మరణ విడిచిపెట్టకూడదు. ఈ సృష్టికి, మీకు, నాకు ఏదైతే ఆధారంగా ఉందో ఆ వస్తువే నారాయణుడు. ఆయన అనుగ్రహం వలన హృదయగ్రంథులు ఛేదింపబడతాయి. హృదయగ్రంథులను ఛేదించుకోవాలనే బుద్ధిని మనకు ఇచ్చేవాడు, ఛేదింపబడేటట్లు చేసేవాడు ఆయనే. ఇంక మనం ఎక్కడ ఉన్నాము అంటే మనం సున్నలం. మనం లేము ఉన్నది ఆయనే. భగవంతుడే ఈ లోకంగా, జీవకోటిగా ఉన్నాడు. అందుచేత జీవకోటికి మనం ఏమి సహాయసహకారములు అందించినా అది భగవంతుడికి నైవేద్యం పెట్టినట్లే. ఎందుచేతనంటే కనిపించనివాడు నీకు లోకంగా, జీవకోటిగా కనిపిస్తున్నాడు. అందుచేత కనిపించే దానిని ఆధారంగా చేసుకొని ఆ కనిపించని వాడిలో ప్రవేశించవయ్యా. మీరు ఏదైనా పని చేసేటప్పుడు అది మంచిపని అనుకొంటే చేసి వదిలేయండి, అలా కాకుండా మేము ఆ మంచిపని చేసాము, ఈ మంచిపని చేసాము అని రోజూ మీరు చేసిన పనులు తలపెట్టుకొంటూ ఉంటే మీకు పుణ్యం రావచ్చుకాని, మీ బుద్ధి శుభ్రంగా మసి అయిపోతుంది. అజ్ఞానం పెరిగిపోతుంది, ఆవరణదోషం పెరిగిపోతుంది, ఈ జీవుడు బందిఖానాలో పడతాడు. అందుచేత మీరు మంచిపని చేయాలంటే చేయండి, చేసి మర్చిపోండి. అంతేగాని దానిని మొయ్యొద్దు, దానిని మోస్తూ ఉంటే అది మిమ్మల్ని బంధిస్తుంది. గీతలో పరమాత్మ ఏమనిచెప్పాడు అంటే నన్ను స్మరించుకొంటూ నీపని చేసుకో అని చెప్పాడు. నీ చేతులను పనిచేసుకోనియ్యి. నువ్వు మనస్సులో మటుకు నన్ను

స్మరించుకొంటూ చేతులతో నీ పని ఏదో నీవు చేసుకో. అప్పుడు నీ మనస్సు శుద్ధి అవుతుంది, నీ పని అయిపోతూ ఉంటుంది. మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి, భగవంతుడు మీకు ఏవైనా అవకాశములు ఇస్తే సృష్టిరూపంలో ఉన్న భగవంతుడికి సహాయసహకారములు అందించండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకోండి కాని ఆ అవకాశములను చూసి గర్వం పెంచుకోవద్దు, అహంకారం పెంచుకోవద్దు, ఆవరణదోషం పెంచుకోవద్దు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను మీరు అజ్ఞానంలో నుండి బయటకురావటానికి ఉపయోగించుకోవాలి కాని అజ్ఞానంలో కూరుకొనిపోవటానికి ఉపయోగించుకోకూడదు. మీకు ఇంటి దగ్గర అవకాశం కుదిరినప్పుడు కొంచెం ధ్యానం చేసుకోండి, రోజూ ఒక గంట సేపు ఏకాంతంగా కూర్చోండి, ఏకాంతవాసం మీకు తెలియకుండా ఏకాగ్రతను పెంచుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-10-05, చిలుకూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఇక్కడ ఎక్కువ మంది మతాన్ని మార్చుకొంటున్నారు అని చెపుతున్నారు. ఎవరూ మతాన్ని మార్చుకోవద్దు. అన్ని మతాలు సమానమే, అన్ని మతాలలో కూడా మంచినే చెప్పారు, జ్ఞానాన్నే చెప్పారు. అన్ని పురుషార్థాలలో ముఖ్యమైనది మోక్షం. మోక్షం పొందటానికి తగిన సామాగ్రి అన్ని మతాలలో ఉంది. ఎవరి మతం ద్వారా వారు బాగుపడవచ్చు. మీకు తరించాలనే తపన కనుక ఉంటే హిందూమతం చాలు. మీరు మోక్షం పొందటానికి తగిన సామాగ్రి హిందూమతంలో ఉంది. ఎవరూ ఇతర మతాలలోనికి వెళ్ళవద్దు, అలా మతాలు మార్చుకోవలసిన అవసరం లేదు, అదీ నేను చెప్పేది. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఆ ఆకర్షణలకు గురి కాకుండా ఎలా జీవించాలి, మోక్షం ఎలా పొందాలి అని చెప్పేదే హిందూ మతం. ఇది ఎవరో ఒక వ్యక్తి చేత స్థాపించబడినది కాదు, ఇది ఒక సనాతన ధర్మం. పంచ భూతాలు ఎప్పటి నుండి అయితే ఉన్నాయో ఈ భూమి ఎప్పుడైతే పుట్టిందో అప్పటినుండి హిందూమతం ఉంది. ఈ మతంలో అనేకమంది అవతారపురుషులు, మహాత్ములు, యోగులు, ఋషులు వచ్చారు. వారిలో రాముడు, కృష్ణుడు ఒకరు. అంతేగాని రాముడి తోటి, కృష్ణుడితోటి ఈ మతం ప్రారంభం అవ్వలేదు. అంతకుముందు కొన్ని లక్షల సంవత్సరాల నుండి ఈ మతం ఉంది. మనం విషంతో కూడిన అన్నం తిని అది చాలా లేటుగా